క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల కలయిక

తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 నుంచి 1995 సంవత్సరం వరకూ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులకు బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

శ్రీఆంజనేయం.. భజేహం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం వివిధ ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి వారికి తమలపాకులతో గంధం, సింధూరాలతో అర్చనలు చేశా రు. రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో క్షేత్రపాలకుడు భక్త ఆంజనేయ స్వామికి పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు నేతృత్వం వహించారు. సీతారాంపేట రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ స్వామి వారిని దర్శించి పూజలు జరిపారు. హౌసింగ్‌బోర్డు దక్షిణముఖ హనుమాన్, సువర్చల సుందర హనుమాన్ ఆలయం వద్ద ఉదయం నుంచి విశేష పూజలు జరిపారు. మన్యుసూక్త సహిత ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ హోమం, సింధూరార్చనలు నిర్వహించారు. భక్తులచే హనుమాన్ పతాక యాత్ర పట్టణంలో నిర్వహించారు.


అత్తిలిలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం


శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో భక్త ఆంజనేయస్వామి

సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి కల్యాణం నిర్వహించారు.

అత్తిలి: హనుమద్ జయంతి పురస్కరించుకుని అత్తిలి పంచముఖ ఆంజనేయస్వామివారిని పుష్పాలు, తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దాసాంజనేయస్వామివారి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. పాలూరు డ్యాం దగ్గర ఉన్న ఆంజనేయస్వామివారికి అభిషేక పూజలు చేశారు. బల్లిపాడు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆరవల్లి గ్రామంలో స్వామివారికి రుద్రాభిషేకం, తమలపాకులతో సింధూర పూజలు జరిపారు.

తేతలిలో శోభాయాత్ర

తణుకు టౌన్ : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తేతలిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ అర్చకులు మాతా ఉత్సవ కమిటీ సభ్యులు క్రాంతి, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని పిల్ల కాలువ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి, వెంకట రమేష్, కోన మునేశ్వరావు, ఎం సంతోష్, రావూరి శ్రీను పాల్గొన్నారు.

నీతి కథల పఠనంతో నైతిక విలువలు

అత్తిలి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే నీతి కథలను చదివించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయిని కె సౌమ్య విద్యార్థులకు మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు పద్యాలు, శ్లోకాలపై, అమ్మ గొప్పదనంపై అవగాహన కల్పించారు. కేరమ్, చెస్ పోటీలు నిర్వహించారు. నీతికథల పఠనంతో విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకుంటారని, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో జి. నాగేశ్వరరావు, గంధం శేషవేంద్రరావు, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివించారు. గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు పద్యాలు, నీతి కథలు, హిందీ, దేశభక్తి గీతాలు నేర్పించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎస్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి విదార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు ‘సంచార’ వైద్య సేవలు

తణుకు టౌన్ : తణుకు పట్టణం, పాతూరు, కే.సావరం గ్రామాల్లో ఆదివారం సంచార వైద్యశాల ద్వారా వైద్య సేవలు అందించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 8 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు ఎంవీఎస్ చలపతిరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృమూర్తులకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని సత్యవతి నగర్ ఉమర్ ఆలీషా ఆశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, చిక్కాల అంబిక, సుభద్ర గుప్తా తదితర యోగా సాధకుల సమక్షంలో 15 మంది మాతృమూర్తులను సత్కరించారు. వక్తలు అమ్మ అనుబంధం తదితర విశేషాలను వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో.. కనిపించే దైవం అమ్మా అని లయన్స్ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎంవీ రమణారావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. మాతృమూర్తులకు సత్కారం చేశారు. వక్తలు మాట్లాడుతూ తల్లి మొదటి గురువు అన్నారు. క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

తణుకు అర్బన్ : కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో యువనేత కారుమూరి సునీల్‌కుమార్ ఆదివారం క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. సరెళ్ల వీరతాత, క్రీడాకారులు పాల్గొన్నారు.